క్లుప్తంగా

రాష్ట్ర విత్తనాభివృద్ధి సంస్థ చైర్మన్‌ను కలిసిన వీరభద్రం

కామేపల్లి: రాష్ట్ర విత్తనాభివృద్ధి సంస్థ చైర్మన్ అన్వేష్‌రెడ్డిని కామేపల్లి పీఏసీఎస్ చైర్మన్, ఓబీసీ జిల్లా కాంగ్రెస్ ప్రెసిడెంట్ పుచ్చకాయల వీరభద్రం హైదరాబాద్‌లో మంగళవారం మర్యాద పూర్వకంగా కలిశారు. ఈమేరకు శాలువా కప్పి సన్మానించారు.

ఆర్థిక సాయం



ఆర్థిక సాయం అందిస్తున్న దృశ్యం

ఖమ్మం సహకారనగర్: నగరంలోని కర్రి మనోజ్ఞకు తల్లిదండ్రులు లేకపోవడంతో ఆమె ఇంజనీరింగ్ చదువు కోసం ఎన్ఆర్ఐ ఫౌండేషన్ బాధ్యులు రూ.35వేలు ఆర్థిక సాయం అందించారు. ఈమేరకు మంగళవారం నగరంలో విద్యార్థినికి చెక్కును అందించారు. అమెరికాలో స్థిరపడిన బండి నాగేశ్వరరావు ఆధ్వర్యాన ఫిలిడిల్ఫియా తెలంగాణ అసోసియేషన్(పీటీఏ) బాధ్యులు మాధవ్ మోసుర్ల అందించారు. అదే విధంగా చింతపల్లి కామరాజు సైతం రూ.5వేలు అందించారు. బయ్యన్న బాబు, పసుమర్తి రంగారావు, బండి నాగేశ్వరరావు, ఆర్.అచ్యుత్, దండా లక్ష్మణ్‌రావు తదితరులు పాల్గొన్నారు.

'రాయల' ఆశయ సాధనకు పోరాడుదాం



మాట్లాడుతున్న శిరోమణి

ఖమ్మంఅర్బన్: పేదల పక్షపాతి, సమసమాజ స్థాపనకు పోరాడిన విప్లవయోధుడు రాయల చంద్రశేఖర్ ఆశయ సాధన కోసం, దోపిడీకి గురయ్యే ప్రజలందరూ ఐక్యంగా పోరాడాలని సీపీఐ(ఎంఎల్) మాస్‌లైన్ ప్రజాపంథా జిల్లా నాయకురాలు సీహెచ్.శిరోమణి పిలుపునిచ్చారు. మంగళవారం నగరంలోని 1వ డివిజన్ కైకొండాయిగూడెం, 3వ డివిజన్ బల్లేపల్లి గ్రామ శాఖల ఆధ్వర్యాన చంద్రశేఖర్‌కు నివాళులర్పించాక జరిగిన సభలో ఆమె మాట్లాడారు. ఈ కార్యక్రమంలో జిల్లా నాయకులు కె.శ్రీనివాస్, భరత్, లెనిన్, బొల్లి కొమరయ్య, వెంకన్న, రామనాథం, లక్ష్మీనారాయణ, నాగయ్య, కృష్ణ, భిక్షం, లింగయ్య పాల్గొన్నారు.

జయప్రదం చేయండి

ఖమ్మంరూరల్: నేటి నుంచి మండలంలోని కాచిరాజుగూడెంలో జరగనున్న తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం రాజకీయ శిక్షణా తరగతులను జయప్రదం చేయాలని వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర నాయకుడు పి.సంగయ్య తెలిపారు. మంగళవారం మండలంలోని వరంగల్ క్రాస్‌రోడ్‌లో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. ఉపాధి హామీ చట్టాన్ని నిర్వీర్యం చేయాలని కేంద్ర ప్రభుత్వం చూస్తోందని, చట్టాన్ని కాపాడుకోవాల్సిన బాధ్యత వ్యవసాయ కూలీలపై ఉందని తెలిపారు.ఉపాధి హామీ చట్టాన్ని కూలీలకు అందకుండా చేస్తే సహించేది లేదని, కూలీల తరఫున పోరాటాలు నిర్వహిస్తామని హెచ్చరించారు. ఈ సమావేశంలో ఎస్.కృష్ణ, కర్లపూడి వెంకటేశ్వర్లు, పగిడిపల్లి వెంకట్రావు పాల్గొన్నారు.


పోటీ పరీక్షలు దోహదం

ఖమ్మం సహకారనగర్: విద్యార్థులు ఉన్నత స్థానాలకు వెళ్లేందుకు పోటీ పరీక్షలు దోహదపడతాయని బేబిమూన్ హైస్కూల్ కరస్పాండెంట్ కేసా వీరన్న, డైరెక్టర్ కేసా భాస్కర్‌లు పేర్కొన్నారు. మంగళవారం పాఠశాలలో స్పెల్ బీ పోటీలు నిర్వహించిన సందర్భంగా వారు మాట్లాడారు. ప్రాథమిక స్థాయి నుంచే విద్యార్థులు తమ భాషా నైపుణ్యాలను పెంపొందించుకునేందుకు ఈ పోటీలు దోహదపడతాయన్నారు. పోటీల్లో గెలుపొందిన విద్యార్థులకు బహుమతులు అందించి అభినందించారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయ, ఉపాధ్యాయేతర సిబ్బంది పాల్గొన్నారు.

ఖమ్మం రైతుబజార్, సమీకృత మార్కెట్

కూరగాయలు కేజీ ధర (రూ.ల్లో)		ఆకుకూరల కట్టలు (రూ.ల్లో)	
టమాట	60	బచ్చలికూర	5
వంకాయ	30		20
బెండకాయ	26	పాలకూర	3
పచ్చిమిర్చి	54		20
కాకర	66	చుక్కకూర	4
బోడ కాకర	280		20
బీర	36	తోటకూర	5
దొండ	36		20
పొట్లకాయ	40	గోంగూర	5
చిక్కుడు	86		20
గోరుచిక్కుడు	40	మెంతికూర	2
క్యాబేజీ	34		20
క్యాలీఫ్లవర్	40	కొత్తిమీర	1
ఆలుగడ్డ	40		25
చామగడ్డ	46	పుదీన	1
క్యారెట్	54		25
క్యాప్సికం	66	-ఖమ్మం వ్యవసాయం	

పైరవీలకే ప్రాధాన్యం..!



జవాన్లు చేయించిందే పని..

ప్రతీ డివిజన్‌లో పారిశుద్ధ్య పనుల నిర్వహణను పర్యవేక్షించడం, కార్మికుల హాజరు తీసుకోవడం, పనులు ఎక్కడ ఎలా జరుగుతున్నాయని పరిశీలించడం వంటివి చూసేందుకు డివిజన్‌కు ఒక జవాన్‌ను నియమించారు. రెగ్యులర్ జవాన్లతో పాటు వారు లేని డివిజన్లలో పలువురు పీహెచ్ వర్కర్లను ఇన్‌చార్జ్‌లుగా నియమించారు. అయితే వీరి పనితీరును పర్యవేక్షించాల్సిన అధికారులు నిర్లక్ష్యంగా ఉండడంతో వారు చేయించిందే పని.. చేసుకుందే పైరవీగా తయారైంది. ఇటీవల 11వ డివిజన్‌లో మేయర్ పునుకొల్లు నీరజ పారిశుద్ధ్య పనులను పరిశీలించేందుకు అక్కడకు వెళ్లగా.. స్థానికులు అక్కడి సమస్యలను వివరించడంతోపాటు జవాన్ డబ్బులు వసూలు చేస్తున్నాడని, ఇతర పనులకు పైరవీలు చేస్తున్నాడని ఏకంగా మేయర్‌కు ఫిర్యాదు చేశారు. దీన్ని బట్టి అధికారుల పర్యవేక్షణ ఎలా ఉందో అర్థం చేసుకోవచ్చు.

పనులను పర్యవేక్షించని శానిటరీ ఇన్‌స్పెక్టర్లు, జవాన్లు

- మధ్యవర్తిత్వం పైనే ప్రధాన ఆసక్తి
- నగరంలో కుంటుపడుతున్న పారిశుద్ధ్యం
- జవాన్‌పై మేయర్‌కు అందిన ఫిర్యాదు
- ప్రక్షాళన చేసేందుకు చర్యలు

ఖమ్మంమయూరిసెంటర్: ప్రజారోగ్యంతో ముడిపడి ఉన్న పారిశుద్ధ్యం నగరంలో అస్తవ్యస్తంగా తయారైంది. అసలే వర్షాకాలంలో ప్రబలే వ్యాధులపై అధికారులు దృష్టి సారించాలని సమీక్షలు నిర్వహిస్తుంటే.. సిబ్బంది మాత్రం పైరవీలపైనే ధ్యాసతో తాపీగా ఉంటున్నారు. పారిశుద్ధ్యాన్ని పర్యవేక్షించాల్సిన శానిటరీ ఇన్‌స్పెక్టర్లు, జవాన్లు అసలు పనిని పక్కనపెట్టి తమకు ఆదాయం వచ్చే మార్గాలను వెతుక్కుంటున్నారు. డివిజన్లలో ప్రజావసరాలను గుర్తించి.. వారికి కావాల్సిన పనులు చేయించి పెడతామని కొందరు డబ్బుల వసూళ్లకు పాల్పడుతుంటే.. మరికొందరు కార్మికులు రాకున్నా హాజరు వేసి మేనేజ్ చేస్తామని వారి నుంచి కూడా పర్సంటేజీలు వసూలు చేసే కార్యక్రమానికి తెరలేపారు. వీరి తీరుతో నగరంలో గత నాలుగు నెలలుగా పారిశుద్ధ్య నిర్వహణ అధ్వానంగా మారింది. కార్పొరేటర్లు, అధికారుల సమీక్ష సమావేశంలో ఏకంగా మంత్రి తుమ్మల నాగేశ్వరరావు పారిశుద్ధ్యంపై పెదవి విరవడమే కాక ఓ ప్రత్యేక అధికారిని నియమిస్తే ఎలా ఉంటుందనే అంశాన్ని ప్రస్తావించారు.

అస్తవ్యస్తంగా చెత్త సేకరణ..

రాష్ట్రంలో ఎక్కడా లేని విధంగా ఖమ్మం కార్పొరేషన్‌లో తొలిసారి ఇంటింటి చెత్త సేకరణను చేపట్టి సత్ఫలితాలను సాధించారు. కూడళ్లలో, రోడ్ల వెంట ఎక్కడా డంపర్ బిన్‌లు లేకుండా నేరుగా ఇంటి నుంచి, దుకాణాల నుంచి చెత్తను సేకరించి డంపింగ్‌యార్డులకు తరలిస్తూ వచ్చారు. గత నాలుగైదు నెలలుగా నగరంలో పారిశుద్ధ్య నిర్వహణపై అధికారులు, పాలకులు సరైన దృష్టి కేంద్రీకరించకపోవడంతో క్షేత్రస్థాయిలో వ్యర్థాలన్నీ రోడ్ల వెంటనే దర్శనం ఇస్తున్నాయి. జవాన్లతో పాటు శానిటరీ ఇన్‌స్పెక్టర్లు బయట పనులకే మొగ్గు చూపుతూ పారిశుద్ధ్యాన్ని గాలికి వదిలేశారనే విమర్శలున్నాయి. పలు డివిజన్లకు సంబంధించి చెత్త సేకరణకు వాహనాలు రోజు విడిచి రోజు వెళ్లడం లేదన్న ఫిర్యాదులు వస్తున్నా సిబ్బంది పట్టించుకోవడం లేదని తెలుస్తోంది.

ప్రక్షాళన వైపు అడుగులు..

గతంలో 700 మంది కార్మికుల్లో ప్రతీ రోజు 30 మందికంటే ఎక్కువ విధులకు గైర్హాజరు కాలేదు. కానీ ఇప్పుడు 100 నుంచి 120 మందికి పైగా గైర్హాజరు అవుతుండడంతో పారిశుద్ధ్య పనుల నిర్వహణ కుంటుపడుతోంది. జవాన్లపై వస్తున్న ఆరోపణలు, పారిశుద్ధ్యం నిర్వహణ అస్తవ్యస్తంగా ఉండడాన్ని మేయర్, అధికారులు సీరియస్‌గా తీసుకున్నారు. పారిశుద్ధ్య విభాగాన్ని ప్రక్షాళన చేసేందుకు చర్యలకు ఉపక్రమించినట్లు తెలిసింది. 60 డివిజన్లకు కేటాయించిన జవాన్లను ప్రస్తుతం పని చేస్తున్న డివిజన్ నుంచి తీసి మరో డివిజన్‌కు కేటాయించి పనులు చేయించుకోవాలని నిర్ణయించినట్లు సమాచారం. రెండు, మూడు రోజుల్లోనే ఈ ప్రక్రియ పూర్తి చేసి పారిశుద్ధ్యాన్ని మెరుగుపర్చాలనే యోచనలో ఉన్నట్లు తెలుస్తోంది.

చర్యలు తీసుకుంటాం..



పారిశుద్ధ్యం మెరుగు పరిచేందుకు చర్యలకు ఉపక్రమించాం. నాలుగు రోజులుగా నగరంలో పర్యటిస్తూ పారిశుద్ధ్య నిర్వహణను పరిశీలిస్తున్నాం. కమిషనర్‌తో కలిసి పారిశుద్ధ్య నిర్వహణ కోసం ప్రత్యేక ప్రణాళికను రూపొందిస్తున్నాం. జవాన్లు డబ్బులు వసూలు చేస్తున్నారన్న ఫిర్యాదులు అందాయి. అలాంటి వారిపై కఠిన చర్యలు తీసుకుంటాం. పారిశుద్ధ్య సిబ్బంది క్షేత్రస్థాయిలో పనులు పర్యవేక్షించకుంటే వారి డివిజన్లు మార్చేస్తాం.

– పునుకొల్లు నీరజ, మేయర్

దవాఖానాల్లో మెరుగైన వైద్యం అందాలి

- రిజిస్టర్ల నిర్వహణ పక్కాగా ఉండాలి
- కేఎంసీ కమిషనర్ అభిషేక్ అగస్త్య

ఖమ్మంమయూరిసెంటర్: ఆరోగ్య సమస్యలతో బస్తీ దవాఖానాలకు వచ్చే వారికి మెరుగైన వైద్యం అందించాలని కేఎంసీ కమిషనర్ అభిషేక్ అగస్త్య వైద్యులను, సిబ్బందిని ఆదేశించారు. మంగళవారం నగరంలోని వైఎస్సార్‌నగర్ కాలనీ, 25వ డివిజన్ తప్పాలగూడ, పాత మున్సిపాలిటీల్లో ఉన్న బస్తీ దవాఖానాలను ఆయన ఆకస్మికంగా సందర్శించి రిజిస్టర్లను తనిఖీ చేసి, వైద్యం అందిస్తున్న తీరును వైద్యులు, స్టాఫ్‌నర్సులను వేర్వేరుగా అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..బస్తీ దవాఖానాకు వచ్చిన రోగులకు రుగ్మతలు నయం అయేలా చికిత్స అందించాలని, రిజిస్టర్లను పక్కాగా ఉండాలన్నారు. అనంతరం పాత మున్సిపాలిటీలోని బస్తీ దవాఖానాను సందర్శించిన సమయాన అక్కడే ఉన్న సిటీ గ్రంథాలయాన్ని సందర్శించి అక్కడి సౌకర్యాలపై ఆరా తీయగా.. బాత్‌రూమ్‌ల సమస్యను కమిషనర్ దృష్టికి తీసుకొచ్చారు. ఆతర్వాత యానిమల్ బర్త్ కంట్రోల్ సెంటర్‌ను సందర్శించి ఏబీసీ నిర్వహణపై వైద్యులకు పలు సూచనలు చేశారు. ఈ కార్యక్రమంలో ఏఎంసీ సంపత్‌కుమార్, సిబ్బంది ఉన్నారు.



రిజిస్టర్లను పరిశీలిస్తున్న కేఎంసీ కమిషనర్ అభిషేక్ అగస్త్య

వంద పడకల ఆస్పత్రిని కొనసాగించాలి



దీక్షలో మాట్లాడుతున్న చావా శివరామకృష్ణ


తిరుమలాయపాలెం: తిరుమలాయపాలెం మండల కేంద్రంలో మంజూరైన వంద పడకల ఆస్పత్రిని తిరుమలాయపాలంలోనే కొనసాగించి పనులు ప్రారంభించాలని కోరుతూ సీపీఎం ప్రజాపంథా మాస్‌లైన్, కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యాన మంగళవారం రిలే నిరాహార దీక్ష చేపట్టారు. ఆస్పత్రి ఎదుట నిర్వహించిన ఈ దీక్షలో కాంగ్రెస్ జిల్లా నాయకుడు చావా శివరామకృష్ణ పాల్గొని మాట్లాడుతూ.. వంద పడకల ఆస్పత్రి ఇక్కడే ఉండేలా చర్యలు తీసుకుంటామని మంత్రి పొంగులేటికి చెప్పి తిరుమలాయపాలెం మండల అభివృద్ధికి సహకరిస్తామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో పప్పుల ఉపేందర్, దొండేటి నిర్మలరావు, ఇప్పుల పుష్పవతి, తుళ్లూరి నాగేశ్వరరావు, దొడ్డ లింగస్వామి, బియ్యం పీఎస్ జిల్లా అధ్యక్షులు మట్టి దుర్గాప్రసాద్, కొమ్ము శంకర్, దొడ్డలింగస్వామి తదితరులు పాల్గొన్నారు. అదే విధంగా ఎమ్మార్పీఎస్, బీఎస్పీ పార్టీల ఆధ్వర్యాన తిరుమలాయపాలెం ఆరోగ్య కేంద్రం ఎదుట ధర్నా నిర్వహించి నిరసన తెలిపారు. ఈ కార్యక్రమంలో చింతిరాల నాగభూషణం, ఎన్నెబోయిన రమేష్ తదితరులు పాల్గొన్నారు.

ఆయుర్వేద వైద్యంపై పర్యవేక్షణ అంతంతే..

ఖమ్మంవైద్యవిభాగం: మోకాళ్లు, నడుము నొప్పి బాధను నయం చేసుకుందామని ఆయుర్వేద వైద్యానికి వెళ్లిన ఓ 50 ఏళ్ల వృద్ధుడు అతడికున్న నొప్పి పోకపోగా.. ఫీజు పేరుతో డబ్బు గుల్ల చేసుకోవడంతో తనకు న్యాయం చేయాలని కలెక్టర్‌ను కలిసిన సంఘటన ఇది. వివరాల్లోకి వెళ్లితే కూసుమంచికి చెందిన వృద్ధుడు మందా నాగులు నడుము, మోకాళ్ల నొప్పితో ఇటీవల నగరంలోని ఎన్‌టీఆర్ సర్కిల్‌లో గల కొట్టకల్ కేరళ ఆయుర్వేద పంచకర్మ వైద్యం చేయించుకునేందుకు వెళ్లాడు. అక్కడ వైద్యం పేరుతో రూ.20 వేలు, మందుల పేరుతో మరో రూ.20 వేలు తీసుకున్నారని అయినా ఆరోగ్యం ఏ మాత్రం నయం కాలేదని నాగయ్య వాపోయాడు. ఈ మేరకు సోమవారం జరిగిన గ్రీవెన్స్‌లో తనకు న్యాయం చేయాలని కలెక్టర్ ముజమ్మిల్‌ఖాన్‌కు మొర పెట్టుకున్నాడు. జిల్లా వైద్య ఆరోగ్యశాఖ ఉన్నతాధికారులు, ఆయుర్వేద సిబ్బంది గత నెలలో కొట్టకల్ కేరళ ఆయుర్వేద పంచకర్మ వైద్యశాలలో తనిఖీ చేయగా.. అందులో అర్హత కలిగిన డాక్టర్, ఫార్మాసిస్టులు లేరని, అసలు ఆస్పత్రికి అనుమతి లేదని తేల్చారు. ఆతర్వాత ఆస్పత్రి యాజమాన్యానికి నోటీసులు లేవు, సీజ్ చేయలేదు. ప్రస్తుతం ఆ ఆస్పత్రి యథావిధిగా కొనసాగుతూనే ఉందని పలు ఫిర్యాదులూ అందాయి. ఇలానే ఆర్‌జేఆర్, ఆయూర్ రక్ష, పాజిటివ్ హోమియో ఇతరాత్ర వాటిలో కూడా అధికారులు లోపాలను గుర్తించి కొన్నింటిని సీజ్ చేయగా.. మరికొద్ది రోజులకే అవి తెరుచుకోవడంపై జిల్లా ప్రజలు పలు అనుమానాలు వ్యక్తం చేస్తున్నారు.

తెలంగాణ ఉద్యమ కళాకారులను ఆదుకోవాలి

ఖమ్మం మామిళ్లగూడెం: తెలంగాణ ఉద్యమ నిరుద్యోగ కళాకారులను ప్రభుత్వం ఆదుకోవాలని కళాకారులు ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. ఈమేరకు మంగళవారం ఖమ్మం మయూరిసెంటర్‌లోని అమరవీరుల స్తూపం వద్ద నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ.. గత మలిదశ తెలంగాణ ఉద్యమంలో యావత్ కళాకారుల పాత్ర కీలకమని, అన్ని జిల్లాల కంటే ఖమ్మం జిల్లా కళాకారులకు తీవ్ర అన్యాయం జరిగిందన్నారు. కేవలం కొద్దిమందిని మాత్రమే గుర్తించి ఉద్యోగాలు ఇచ్చి నిజమైన కళాకారులకు నిరాశ మిగిలిందన్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించాలని కోరారు. ఈ కార్యక్రమంలో గుడిపల్లి పుల్లారావు, అరెంపుల్ల సతీష్, పత్తిపాటి లక్ష్మీకాంతమ్మ, నరసింహరావు, ఎస్‌కె.ఫక్రుద్దీన్, పుల్లూరు రాము, చంద్రమోహన్, గురువయ్య, పెద్దపాక విజయ్ తదితరులు పాల్గొన్నారు.



నిరసన వ్యక్తం చేస్తున్న కళాకారులు

లారీ కిందకు దూసుకెళ్లిన బైక్

నేలకొండపల్లి: ప్రమాదవశాత్తు లారీ కిందకు బైక్ దూసుకెళ్లిన ఘటన మండలంలో చోటు చేసుకుంది. మండలంలోని ఓ క్వారీ నుంచి సోమవారం రాత్రి గ్రానైట్ రాళ్లతో లారీ రాజమండ్రి వెళ్తుండగా.. కోనాయిగూడెం మూలమలుపు వద్ద ఎదురుగా బైక్‌పై వచ్చిన వ్యక్తి నియంత్రించుకోలేక కిందకు దూసుకెళ్లాడు. అయితే, ఆ సమయాన లారీ నెమ్మదిగా వెళ్తుండడంతో ద్విచక్ర వాహనదారుడికి స్వల్ప గాయాలు కాగా బైక్‌ను వదిలేసి వెళ్లిపోయాడు. ఈవిషయమై డ్రైవర్ ఇచ్చిన సమాచారంతో పోలీసులు లారీని స్టేషన్‌కు తీసుకొచ్చారు. అయితే, ఘటనపై క్షతగాత్రుడు ఫిర్యాదు చేయలేదని తెలిపారు.

సమస్యలు పరిష్కరించాలి



ఆస్పత్రిలో ఆరా తీస్తున్న ఐద్వా బృందం

నేలకొండపల్లి: ప్రభుత్వాస్పత్రిలో నెలకొన్న సమస్యలను వెంటనే పరిష్కరించాలని ఐద్వా మండల కార్యదర్శి బెల్లం లక్ష్మి డిమాండ్ చేశారు. మంగళవారం స్థానిక ఆస్పత్రిలో ఐద్వా కమిటీ బృందం ఆకస్మికంగా తనిఖీ చేసి అక్కడ అందుతున్న వైద్య సేవలను బాధితులను అడిగి తెలుసుకున్నారు. వైద్యాధికారిని కలిసి సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేశారు. స్థానిక ఆస్పత్రిలో సౌకర్యాలు లేక ఖమ్మంలోని ఆస్పత్రులకు తరలుతూ.. 'ప్రైవేట్'దోపిడీకి గురవుతున్నారని,సరిపడా వైద్యులు,సిబ్బంది అందుబాటులో ఉండి అన్ని రకాల పరీక్షలు నిర్వహించి అవసరమైన మందులను అందించాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఐద్వా మండల నాయకులు మున్నంగి లక్ష్మి, సిరికొండ వెంకట్రావమ్మ, వెంకటలక్ష్మి పాల్గొన్నారు.

ఇద్దరికి పాముకాటు

నేలకొండపల్లి: మండలంలో ఇద్దరు పాము కాటుకు గురయ్యారు. మండలంలోని సదాశివాపురంలో రాజశేఖర్, మహబూబ్‌నగర్‌కు చెందిన కృష్ణవేణిలను మంగళవారం పాముకాటుకు గురయ్యారు. కాగా, కృష్ణవేణి నేలకొండపల్లిలో రహదారి పనులు చేసేందుకు రాగా పనులు చేసే ప్రదేశంలో పాము కాటేసింది. వీరికి స్థానిక ప్రభుత్వ ఆస్పత్రిలో చికిత్స చేయించారు.

విద్యాప్రగతికి కృషి అభినందనీయం

ఖమ్మంక్రైం: విద్యాప్రగతికి వాసిరెడ్డి సేవా సమితి చేస్తున్న కృషి అభినందనీయమని శ్రీకృష్ణ ప్రసాద్ మెమోరియల్ పాఠశాల కోశాధికారి ఏఆర్ ఆర్‌వి కామరాజు అన్నారు. మంగళవారం ప్రాథమిక విద్యార్థులకు సేవా సమితి ఆధ్వర్యాన రాత పుస్తకాలు, పెన్నులు, పెన్సిళ్లను వాసిరెడ్డి సేవా సమితి ఆర్‌వి చేతుల మీదుగా అందజేసిన సందర్భంగా ఆయన మాట్లాడారు. ఈ కార్యక్రమంలో సంఘం అధ్యక్ష, కార్యదర్శులు వాసరెడ్డి వీరభద్రరావు, సుబ్బారావు, సభ్యులు వెంకటేశ్వరరావు, రాధాకృష్ణ, అర్జున్‌రావు, వైస్ ప్రినిపాళ్లు సత్యనారాయణ, ఎండీ సైఫుద్దీన్ తదితరులు పాల్గొన్నారు.

వినతుల వెల్లువ..

కొత్త నేర చట్టాలు సవరించాలి..



బండి సంజయ్‌కు వినతిపత్రం ఇస్తున్న బార్ అసోసియేషన్ సభ్యులు

ఖమ్మంలీగల్: కొత్త నేర చట్టాలను సరించాలని కోరుతూ ఖమ్మం బార్ అసోసియేషన్ సభ్యుల ఆధ్వర్యాన కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్‌కు వినతిపత్రం అందజేశారు. కొత్త నేర చట్టాలతో ప్రజలు పడే ఇబ్బందులను తాళ్లూరి దిలీప్‌చౌదరి, ఖమ్మం బార్ అసోసియేషన్ ప్రెసిడెంట్ నేరళ్ల శ్రీనివాస్‌రావులు మంత్రికి వివరించారు. అనంతరం సెంట్రల్ నోటరీ పబ్లిక్ అపాయింట్‌మెంట్స్, అడ్వకేట్స్ ప్రొటెక్షన్ బిల్లును కూడా ప్రవేశపెట్టాలని కోరారు. ఈ కార్యక్రమంలో సంక్రాంతి రాజశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

కుక్కల సమస్య పరిష్కరించాలి..

ఖమ్మంమయూరిసెంటర్: నగరంలో కుక్కల సమస్యను పరిష్కరించాలని సీపీఎం రాష్ట్ర కమిటీ సభ్యుడు యర్రా శ్రీకాంత్ మంగళవారం మేయర్ పునుకొల్లు నీరజకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా శ్రీకాంత్ మాట్లాడుతూ.. నగరంలో కుక్కల బెడద విపరీతంగా పెరిగిందని, రోడ్లపై వెళ్తున్న వాహనదారులు, పాదచారులను కుక్కలు వెంబడించడంతో ఆందోళనకరంగా మారిందన్నారు. ఇక నగరంలో అంతర్గత రోడ్లు గుంతలతో అధ్వానంగా ఉన్నాయని, నిలిచిపోయిన అభివృద్ధి పనులను పూర్తి చేయాలని, పారిశుద్ధ్యాన్ని మెరుగుపరచాలని కోరారు. ఈ కార్యక్రమంలో పార్టీ జిల్లా కార్యదర్శివర్గ సభ్యుడు వై.విక్రమ్, జిల్లా కమిటీ సభ్యుడు యర్రా శ్రీనివాసరావు, ఖానాపురంహవేలీ కార్యదర్శి దొంగల తిరుపతిరావు, మండల నాయకులు ఎస్‌కేవీపీ మీరా, టూటౌన్ కార్యదర్శి బోడపట్ల సుదర్శన్, త్రీటౌన్ కార్యదర్శి భూక్య శ్రీనివాస్‌రావు తదితరులు పాల్గొన్నారు.

కారుణ్య నియామకాలు చేపట్టాలి..

ఖమ్మంమయూరిసెంటర్: టీజీఎస్ఆర్‌టీసీలో కారుణ్య నియామకాలను చేపట్టాలని బాధితులు రీజినల్ మేనేజర్ ఎ.సరిరామ్‌కు వినతిపత్రం అందజేశారు. మంగళవారం ఖమ్మం పాత బస్టాండ్‌లోని రీజినల్ మేనేజర్ కార్యాలయం వద్ద పీవైఎల్, పీడీఎస్‌యూ ఆధ్వర్యాన బాధిత కుటుంబాలు నిరసన తెలిపాయి. ఈ సందర్భంగా పీవైఎల్ రాష్ట్ర కార్యదర్శి కోల లక్ష్మీనారాయణ, పీడీఎస్‌యూ జిల్లా కార్యదర్శి మస్తాన్ మాట్లాడుతూ.. పదేళ్లుగా టీఎస్ఆర్టీసీలో కారుణ్య నియామకాలు చేపట్టకపోవడంతో పోషించే కుటుంబ దిక్కును కోల్పోయి, ఉపాధి దొరక్క బాధిత కుటుంబాలు ఇబ్బందులు పడుతున్నాయన్నారు. వెంటనే కారుణ్యనియామకాల కింద ఉద్యోగాలు ఇప్పించాలని కోరారు. ఈ కార్యక్రమంలో సంఘ నాయకులు ఉమాశంకర్, సర్వేందర్, రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

పెండింగ్ బిల్లులు చెల్లించాలి..

కామేపల్లి: మధ్యాహ్న భోజన కార్మికుల పెండింగ్ వేతన బిల్లులు వెంటనే విడుదల చేయాలని తెలంగాణ మధ్యాహ్న భోజన పథకం కార్మికుల యూనియన్ మండల నాయకులు మంగళవారం తహసీల్దార్ సుధాకర్‌కు వినతిపత్రం అందించారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన హామీ మేరకు రూ.10 వేలు వేతనం ఇవ్వాలని, ప్రమాద బీమా, పీఎఫ్, ఈఎస్ఐ సౌకర్యం కల్పించాలని డిమాండ్ చేశారు.

బదిలీలు, బాధ్యతల స్వీకరణ

రఘునాథపాలెం మండల పరిషత్‌లో ఉద్యోగుల బదిలీ..

రఘునాథపాలెం: రఘునాథపాలెం మండల పరిషత్ కార్యాలయంలో పలువురు ఉద్యోగులు బదిలీ చేస్తూ అధికారులు ఉత్తర్వులు జారీ చేశారు. కార్యాలయంలో సూపరింటెండెంట్, ఆఫీస్ సబార్డినేట్‌లుగా పని చేస్తున్న జానిమియా, గోవింద్‌లు చింతకాని ఎంపీడీఓ కార్యాలయానికి,ఖమ్మం రూరల్ మండల పరిషత్ కార్యాలయంలోని సూపరింటెండెంట్, ఆఫీస్ సబార్డినేట్‌లుగా పని చేస్తున్న బి.సుధాకర్ రెడ్డి, పాషీలు రఘునాథపాలెంకు బదిలీ అయ్యారు. అదే విధంగా రఘునాథపాలెం మండలంలో ఒక రెగ్యులర్ పంచాయతీ కార్యదర్శితో పాటు 11 మంది జూనియర్ పంచాయతీ కార్యదర్శులను మొత్తం 12 మంది కార్యదర్శులను బదిలీ చేయగా.. వారి స్థానంలో 12 మంది పంచాయతీ కార్యదర్శులు ఇతర మండలాల నుంచి వచ్చారు. ఖాళీగా ఉన్న రాములుతండా గ్రామ పంచాయతీకి కూడా నూతన కార్యదర్శిని నియమించారు. ఈమేరకు బదిలీపై వచ్చిన వారంతా బాధ్యతలు స్వీకరించారు.

విధుల్లో చేరిన కేఎంసీ ఉద్యోగులు..

ఖమ్మంమయూరిసెంటర్: ఖమ్మం మున్సిపల్ కార్పొరేషన్‌కు బదిలీపై వచ్చిన ఉద్యోగులు మంగళవారం బాధ్యతలు చేపట్టారు. కేఎంసీకి బదిలీపై వచ్చిన సీనియర్ అకౌంటెంట్ సతీష్, బిల్లు కలెక్టర్లు శ్రీను, అవినాష్, హెల్త్ అసిస్టెంట్ శివకుమార్‌లు కార్యాలయంలో రిపోర్ట్ చేసి, బాధ్యతలు స్వీకరించారు. ఇక కేఎంసీలో విధులు నిర్వర్తిస్తూ బదిలీ అయిన ఉద్యోగులు రిలీవ్ అయ్యారు.

నియామకాలు..

ప్రభుత్వ న్యాయవాదిగా అయితం రవీందర్

ఖమ్మం లీగల్: జిల్లా కోర్టులో ప్రభుత్వ న్యాయవాదిగా నగరానికి చెందిన సీనియర్ న్యాయవాది అయితం రవీందర్‌ను నియమిస్తూ మంగళవారం కలెక్టర్ ముజమ్మిల్‌ఖాన్ ఉత్తర్వులు జారీ చేశారు. ఆయన నగరంలోని ఎస్ఆర్‌అండ్‌బీజీఎన్ఆర్ కళాశాలలో డిగ్రీ పూర్తి చేసి 1990లో విజయవాడ సిద్దార్థ లా కాలేజీలో న్యాయశాస్త్రంలో పట్టా పొందారు. అదే సంవత్సరం ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ బార్ కౌన్సిల్‌లో న్యాయవాదిగా చేరి పలువురి వద్ద జూనియర్ న్యాయవాదిగా పనిచేశారు. ఆతర్వాత స్వతంత్రంగా ప్రాక్టీస్ చేశారు. రవీందర్ నియమకం పట్ల పలువురు న్యాయవాదులు హర్షం వ్యక్తం చేశారు.

తెలంగాణ ఉద్యమకారుల సంఘం జిల్లా ఇన్‌చార్జ్‌గా సురేష్..

ఖమ్మంవన్‌టౌన్: తెలంగాణ ఉద్యమకారుల సంఘం ఉమ్మడి ఖమ్మం జిల్లా ఇన్‌చార్జ్‌గా రడం సురేష్‌ను నియమితులైనట్లు ఫౌండర్ చైర్మన్ డాక్టర్ పిడమర్తి రవి తెలిపారు. ఈ సందర్భంగా రడం సురేష్ మాట్లాడుతూ.. కాంగ్రెస్ మ్యానిఫెస్టోలో చెప్పిన విధంగా రాష్ట్రంలోని ఉద్యమకారులకు 250 గజాల ఇంటి స్థలం సాధన కోసం ఈ సంఘం ఏర్పడిందని, ఉమ్మడి ఖమ్మం జిల్లా వ్యాప్తంగా ఉన్న ఉద్యమకారులను ఏకం చేసి వారి సంక్షేమానికి కలిసి పనిచేస్తామన్నారు. తన నియామకం పట్ల రవికి కృతజ్ఞతలు తెలిపారు.

రఘునాథపాలెం ఎస్సైగా మౌలానా..

రఘునాథపాలెం: రఘునాథపాలెం ఎస్సైగా ఎండీ. మౌలానా మంగళవారం బాధ్యతలు స్వీకరించారు. ఇక్కడ ఎస్సైగా పని చేసిన సురేష్ కొత్తగూడెం జిల్లాకు బదిలీకాగా ఆయన స్థానంలో మహబూబాబాద్ జిల్లాకు చెందిన మౌలానా ఇక్కడకు వచ్చారు. సోమవారం సీఐగా ఉస్మాన్‌షరీఫ్ బాధ్యతలు తీసుకున్న విషయం తెలిసిందే. ఈమేరకు సీఐ, ఎస్సైలను పలువురు శుభాకాంక్షలు తెలిపారు.

ఎస్సై నాగరాజు కమిషనరేట్‌కు అటాచ్?

నేలకొండపల్లి: స్థానిక ఎస్సై తోట నాగరాజును మంగళవారం ఖమ్మం కమిషనరేట్‌కు అటాచ్ చేసినట్లు తెలిసింది. గత ఐదు నెలల క్రితం నేలకొండపల్లి ఎస్సైగా బాధ్యతలు చేపట్టిన ఆయనను బదిలీల సందర్భంలో కాకుండా అత్యవసరంగా అతి కొద్ది కాలంలోనే అటాచ్ చేయడంతో పోలీస్‌శాఖ వర్గాల్లో చర్చంశనీయంగా మారింది. కాగా, ఎస్సై అటాచ్‌కు గల కారణాలు తెలియాల్సి ఉంది. ఈ విషయమై ఎస్సై తోట నాగరాజును వివరణ కోరేందుకు ప్రయత్నించగా అందుబాటులో లేరు.

వెదజల్లే పద్ధతి మేలు

నేలకొండపల్లి: వరిలో నేరుగా వెదజల్లే పద్ధతులు పాటించి అధిక దిగుబడులు సాధించాలని మండల వ్యవసాయాధికారి దేశబోయిన అరుణకుమారి సూచించారు. మండలంలోని మండ్రాజుపల్లిలో మంగళవారం వరి వెదజల్లే పద్ధతులను పరిశీలించిన సందర్భంగా ఆమె మాట్లాడారు. ఈమేరకు ఆమె వరి విత్తనాలను పొలాల్లో వెదజల్లి పలు సూచనలు చేశారు. ఈ నేపథ్యాన కొత్తగా పట్టాదారు పాస్ పుస్తకం వచ్చిన వారు వచ్చే నెల 5వ తేదీలోగా రైతు బీమా పథకానికి దరఖాస్తు చేసుకోవాలని, లేనివారు తహసీల్దార్ ద్వారా డిజిటల్ సంతకం ఉన్నడీఎస్ పేపరును అందించాలన్నారు. రైతులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఏఈఓ బి.అవినాష్ తదితరులు పాల్గొన్నారు.

సీపీఎం నాయకుడి మృతిపై సంతాపం

నేలకొండపల్లి: మండలంలోని మోటాపురానికి చెందిన సీపీఎం నాయకులు చావా లెనిన్(53) మృతిపై వివిధ పార్టీల నాయకులు సంతాపం తెలిపారు. మంగళవారం ఉదయం ఆయన ఖమ్మంలోని తన నివాసంలో గుండెపోటుతో మృతి చెందారు. ఈమేరకు సీపీఎం, సీపీఐ, కాంగ్రెస్, బీజేపీ, బీఆర్ఎస్ నాయకులు పోతినేని సుదర్శన్‌రావు, నున్నా నాగేశ్వరరావు, బాగం హేమంతరావు, కే.వీ.రెడ్డి, గుడవర్తి నాగేశ్వరరావు, ఏటుకూరి రామారావు, ఇంటూరి అశోక్, బెల్లం లక్ష్మి, రావెళ్ల కృష్ణారావు, గుడిమళ్ల మోహన్, మధు, రవికుమార్, బెల్లం వేణు తదితరులు ఆయన మృతదేహం వద్ద నివాళులర్పించి కుటుంబ సభ్యులను పరామర్శించారు.

ఆదాయపు పన్ను చట్టంపై అవగాహన

ఖమ్మంగాంధీచౌక్: బీఎస్ఎన్ఎల్ ఉద్యోగులకు మంగళవారం ఆదాయపు పన్ను చట్టంపై ఆ శాఖ అధికారులు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆదాయపు పన్ను అధికారి ఉమామహేశ్వరరావు మాట్లాడుతూ.. ఉద్యోగులు రిటర్న్ దాఖలు చేసే ముందు అందుబాటులో ఉన్న సమాచారాన్ని సరిచూసుకోవాలని, నిజమైన తగ్గింపులు, మినహాయింపులను క్లెయిమ్ చేయాలని సూచించారు. దీని ద్వారా ఆదయపు పన్ను నుంచి స్క్రూట్నీ నోటీసులను తగ్గిస్తుందని, బోగస్ రిఫండ్స్‌ను క్లెయిమ్ చేస్తున్నారని తెలితే భారీ జరిమానాలు చెల్లించాల్సి వస్తుందని వివరించారు. అంతేగాక ప్రాసిక్యూషన్‌ను ఎదుర్కోవాల్సి ఉంటుందన్నారు. ఈ సమావేశంలో బీఎస్ఎన్ఎల్ డీజీఎం శ్రీనివాస్‌రావు, ఆదాయ పన్ను శాఖ పర్యవేక్షకులు చైతన్య తదితరులు పాల్గొన్నారు.



అవగాహన కల్పిస్తున్న ఉమామహేశ్వరరావు